క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సైదారావు తెలిపారు. పట్టణంలోని బైపాస్, మహావీర్ నగర్, జానపాడు, కొండమోడు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

దాచేపల్లి : నడికుడి, పెదగార్లపాడు, శ్రీనగర్, తంగెడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు భగవాన్‌నాయక్, దండె నాగేశ్వరరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా ఉంటుంది

ఎమ్మెల్యే జూలకంటి



రెంటచింతల: ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్య తరగతి కుటుంబాలకు అత్యవసర పరిస్థితుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా ఉంటుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన శీలం రత్నం కుమారుడు అనీల్‌కు రూ.90 వేల చెక్‌ను అందజేసి మాట్లాడారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, సిద్దయ్య, ఇన్నారెడ్డి తదితరులున్నారు.

21న సర్వసభ్య సమావేశం

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి కె.సరోజినిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఇతర అంశాలపై చర్చ, గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం, సీజనల్, అంటు వ్యాధులపై సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలి

గురజాల డీఎస్పీ జగదీష్



మాచర్ల రూరల్: సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుదారుతో స్నేహపూరితంగా మెలిగి వారికి మనోధైర్యం ఇచ్చేలా ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేలా పోలీసులు పని చేయాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. శుక్రవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. గ్రామాలలో నిఘా వ్యవస్థను బలోపేతం చేసి ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి నివారణలో సిబ్బంది కృషి చేయాలన్నారు. నేర వ్యవస్థను నిరోధించి క్రైం రేటింగ్‌ను అరికట్టడంలో సమిష్టిగా పనిచేయాలన్నారు. రూరల్ పరిధిలో శాంతిభద్రతల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని, ఇలానే పనిచేయాలని సూచించారు. రానున్న క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ షేక్ నసీఫ్ బాషా, ఎస్ఐ ఎం.నారాయణ, ఏఎస్ఐ రఫీ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

జర్నలిస్టులపై దాడి దుర్మార్గం

గురజాల రూరల్ : జర్నలిస్టులపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆచంట కృష్ణకుమార్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండల కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టులు, వీడియో కెమెరామెన్‌లపై దాడిచేసి వారిని గాయపర్చిన వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ భూతం



అరికట్టకపోతే.. చెల్లించక తప్పదు మూల్యం

- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం
- ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు
- టీ స్టాల్, హోటళ్లు, వ్యాపార సంస్థలు అంతా ప్లాస్టిక్ మయం
- ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోని వ్యాపారులు
- అవగాహన కల్పించటంలో అధికారుల నిర్లక్ష్యం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అనేది కేవలం మాటలకే తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్లాస్టిక్ నిషేధం యథా రాజా.. తథా ప్రజా అన్న చందంగా తయారైంది. పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ఎంత అవగాహన కల్పిస్తున్నా.. వాడకం మానుకోండని గగ్గోలు పెడుతున్నా ఇటు ప్రజలు గాని.. అటు వ్యాపారులు, సంబంధిత అధికారులు గాని పెడచెవిన పెడుతున్నారు. తాగే నీరు, పీల్చే గాలి, తినే ఆహారం చివరికి మనిషి శరీరంలోనూ ప్లాస్టిక్ అవశేషాలు ఉన్నట్లు పలు పరిశోధనల్లో తేలింది. ఇప్పటికైనా ఎవరికి వారు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

మాచర్ల రూరల్: ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. దానిని వినియోగించిన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. తక్కువ మైక్రాన్లున్న కవర్లను వాడటం వలన జరిగే అనర్థాలపై అవగాహన కరువైంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్నిసార్లు, ఎన్ని రకాలుగా చెప్పినా ఇటు వినియోగదారులు.. అటు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రజల బాధ్యతారాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ సాధ్యపడటం లేదు.



ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే చర్యలు అంటూ ప్రకటనలకే పరిమితమైన పోస్టర్

చర్యలు తీసుకుంటాం



ప్లాస్టిక్ కవర్లు, పేపర్ ప్లేట్లు, టీ కప్పుల వాడకాన్ని నివారించడం కోసం మొదటి విడతగా ప్రచార కార్యక్రమాన్ని పోస్టర్ల ద్వారా చేపట్టాం. వ్యాపారులకు అవగాహన కల్పించి అటుపిమ్మట షాపులపై దాడులు నిర్వహించి పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడతాం.

– ధూళిపాళ్ళ వేణుబాబు, మున్సిపల్ కమిషనర్, మాచర్ల

ప్రకటనలకే పరిమితం

మాచర్ల పట్టణంలో సిమెంట్ పరిశ్రమ, నాపరాయి వంటి నిక్షేప గనులతో, నిత్యం దుమ్ము ధూళితో ప్రమాదకరంగా ఉంటుంది. దీనికి తోడు ప్లాస్టిక్ భూతం వెంటాడుతుంది. అయితే ప్లాస్టిక్ వాడకంపై అధికారులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సి ఉంది. కానీ పురపాలక శాఖాధికారులు కేవలం గోడలపై ఫ్లెక్సీలతో ప్రకటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతుంది.

నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు

గుడి, బడి, బజారు, కిరాణా షాపు, హోటళ్లు, మార్కెట్ ఎక్కడికి వెళ్లినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నారు. 75 మైక్రాన్ల పైన మందం కలిగిన కవర్లు వాడాల్సి ఉన్నా గ్రామాలలో, పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్, కిరాణా, సూపర్‌మార్కెట్, పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, చికెన్, మటన్, చేపలు విక్రయించేవారు, వర్తక వాణిజ్య వ్యాపారులు తమ లావాదేవీలలో నిత్యం విరివిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. వ్యాపారులు కూడా ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. చిరు వ్యాపారుల నుంచి పెద్ద పెద్ద మాల్స్ వరకు ఎక్కడ చూసిన ప్లాస్టికకవర్లలోనే అమ్మకాలు చేస్తున్నారు. నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లను రోడ్లపై పడవేయటంతో అవి తిన్న మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రజలు కవర్లలో పడవేసిన తిండిని చూసి తిండి కోసం వచ్చి కవర్లను తింటున్నాయి. దీంతో పశువుల కడుపులోకి కవర్ల రూపంలో వెళ్లిన ప్లాస్టిక్‌తో అవి మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణంతో పాటు మనుషులకు, మూగజీవాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. ఇప్పటికైనా నిషేధిత ప్లాస్టిక్‌పై కఠిన చర్యలు తీసుకుని దాడులు చేసి విక్రయాలు నిలుపుదల చేయాలని పలువురు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



పట్టణంలోని లాడ్జి సెంటర్‌లో రోడ్లపై పడవేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు

గురజాల పోలీస్ స్టేషన్‌లో 'మీతో మేము'



గురజాల : స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మీతో మేము ప్రచార బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మీతో మేము ప్రచార బోర్డును ప్రారంభించి మాట్లాడుతూ 'మీతో మేము' కార్యక్రమం ప్రజలకు పోలీస్ సేవలు చేరువ చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. స్టేషన్‌కు వచ్చే కక్షిదారులు, ప్రజలకు అవగాహన కల్పించేలా బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్ తదితరులున్నారు.

భవానీ మాలధారులతో అమ్మవారి ఊరేగింపు



పిడుగురాళ్ల: పట్టణంలోని భవాని నగర్‌లో వేంచేసియున్న కనక దుర్గమ్మ అమ్మవారి దేవాలయం వద్ద భవానీ మాలధారులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వద్ద అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా మాలధారులు 41 రోజుల భవానీ మాల పూర్తి కావటంతో విశేషంగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో మాలధారులు, భక్తులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఏఈ షేక్ మస్తాన్‌వలి

రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి అన్నారు. శుక్రవారం రెంటచింతలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెంటచింతల గ్రామ సమీపంలోని రైతులు పేర్ల ముత్తయ్య, వెంకటరెడ్డి పంట పొలాల్లో ఏజీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ గురువారం రాత్రి చోరీకి గురైందని తెలిపారు. ఇటీవల రెంటచింతలకు చెందిన పల్లెర్ల చిన్నవెంకట నర్సిరెడ్డి, పంగులూరి పూర్ణచంద్రరావు, మద్దిరాల అంకిరెడ్డి, మంచికల్లు గ్రామానికి చెందిన లింగిరెడ్డి కోటిరెడ్డి, ధర్మనబోయిన రామచంద్రరావు పంట పొలాల్లోని ఏజీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్ చోరీ చేశారన్నారు. పొలాల్లో ఉన్న 25 కేవీ, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కొంత కాలంగా మాచర్ల ఏరియాలో ఎక్కువగా ఈ చోరీలు చోటు చేసుకుంటున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్‌వైర్‌ను తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 44 నుంచి 46 కేజీలు, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 48 కేజీల కాపర్‌వైర్ ఉంటుందని తెలిపారు. రైతులు మరలా కొత్తది కొనుగోలు చేయాలంటే రూ.40 వేలు ఖర్చు అవుతుందని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సులభంగా నగదు సంపాదనకు అలవాటు పడిన కొందరు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు జరిగిన చోరీలకు సంబంధించి బాధితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశామని ఏఈ తెలిపారు.



చోరీకి గురైన ఏజీఎల్ ట్రాన్స్‌ఫార్మర్లు

నిజాన్ని నిగ్గు తేల్చండి

- డీఆర్వోను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- ఫర్నిచర్ మాయంపై దర్యాప్తు చేయండి

గురజాల : రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఫర్నిచర్ మాయం అంటూ కూటమి నాయకుల ఆరోపణలపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేసి నిజాన్ని నిగ్గు తేల్చాలని డీఆర్వో మురళిని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీడీపీ నాయకులు వారి హయాంలో డివిజన్ కార్యాలయంలో ఫర్నిచర్ అందుబాటులో ఉంచామని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆ ఫర్నిచర్ మాయమైందని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. నిజం లేని ఆరోపణలు చేసి కూటమి నాయకులు పబ్బం గడుపుతున్నారన్నారు. ఆర్డీవో కార్యాలయానికి సామగ్రిని ఎంత కొన్నారు.. ఎంత విలువ.. ఎన్ని కొన్నారు.. అన్న వివరాలను విచారణ జరపాలన్నారు. ప్రజలను పథకాల నుంచి పక్కదారి పట్టించాలనే ఆలోచనతో ఈ కుట్రకు తెరలేపారన్నారు. ఫర్నిచర్‌ను దొంగిలించిన వారిని అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, వేముల చలమయ్య, కొమ్మినేని బుజ్జి, మన్నెం ప్రసాద్, వి.అమరారెడ్డి, జక్కా రమణ, షేక్ పీర్ అహ్మద్ తదితరులున్నారు.



డీఆర్వో మురళికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంచు దుప్పటి కప్పుకున్న లైమ్‌సిటీ



మంచు తెర చాటు నుంచి సూర్యుడు ఉదయిస్తున్న దృశ్యం

లైమ్ సిటీని శుక్రవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 10 గంటలయినా పట్టణాన్ని మంచు వీడలేదు. ఉదయం 6 గంటల సమయంలో రైల్వే స్టేషన్‌లో కొంచెం దూరంలోనే రైల్వే ట్రాక్ కనిపించకుండా ఉంది. అంతేకాకుండా అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై ఎదురు వాహనాలు కనిపించలేనంతగా మంచు కప్పుకొని పోయింది. ఉదయం 8 గంటలు దాటినా సూర్యుడు ఉదయిస్తూనే ఉన్నా మంచు మాత్రం లైమ్ సిటీని వదిలి పెట్టలేదు. ఎప్పుడు దుమ్ము ధూళితో ఉండే లైమ్ సిటీని ఒక్కసారిగా మంచు దుప్పటి కప్పేసింది. – పిడుగురాళ్ల



అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేను కప్పి ఉన్న మంచు

భూ సమస్యలు పరిష్కరిస్తాం

తహసీల్దార్ కుటుంబరావు



పొందుగలలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కుటుంబరావు

దాచేపల్లి : రైతుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ వైవీ కుటుంబరావు అన్నారు. మండలంలోని పొందుగల గ్రామంలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 13 అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కుటుంబరావు మాట్లాడుతూ భూ సమస్యలపై రైతుల నుంచి అందిన అర్జీలను పరిశీలన చేసి త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. భూ సమస్యలు ఉంటే రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలో పర్యటించి రైతులతో కూడా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రాజా, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు



జమ్మలమడక రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రమణ తదితరులు

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని జమ్మలమడక గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు సంబంధించి భూముల సమస్యలలో ప్రధానంగా అడంగల్‌లో పేరు మార్పు 22ఏలో మ్యుటేషన్, ఎల్ఈసీ కార్డులతో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణలు, గట్టు తగాదాలను సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందిస్తే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. వివిధ సమస్యలపై 15 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ సాంబశివరావు, ఆర్ఐ భాస్కర్, వీఆర్ఓ, కార్యదర్శి, రైతులు ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎన్నికల అధికారి వై.శివ నాగేశ్వరరావు

రెంటచింతల: మండలంలోని సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహిస్తున్న ఎన్నికలను పోలింగ్ అధికారులు, సిబ్బంది నియమ నిబంధనల మేరకు విధులను అంకితభావంతో చేపట్టాలని ఎన్నికల అధికారి వై.శివనాగేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సహాయ ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు పోలింగ్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. రెంటచింతల, రెంటాల, మిట్టగుడిపాడు, పశర్లపాడు, పాలువాయి, తుమృకోట గ్రామాలలో 6 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. మధ్యాహ్నం నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఉంటుందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా జలవనరుల శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, డిప్యూటీ తహసల్దార్ పి.బ్రహ్మయ్య, ఆర్ఐ పల్లా రామకృష్ణ, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శివ నాగేశ్వరరావు

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

దాచేపల్లి : సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి మొదలైంది. సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో సంఘ సభ్యులను ఎన్నుకునే ప్రక్రియకు సంబంధించి అర్హత కోసం రైతులు నీటి తీరువ రశీదులు, భూమి శిస్తు రశీదులను శుక్రవారం తీసుకున్నారు. నారాయణపురంలోని జలవనరుల శాఖ కార్యాలయం వద్ద ఈ ప్రక్రియను అధికారులు చేపట్టారు. జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతులకు రశీదులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న రైతులు రశీదులు తీసుకుని వివరాలు నమోదు చేసుకుంటున్నారు. దాచేపల్లి మండలం తంగెడ మేజర్ కాలువ పరిధిలో.. చిన్నగార్లపాడు-1, తుమ్మలచెరువు-2, కేసానుపల్లి-2, దాచేపల్లి-2, మాదినపాడు-1, తంగెడ-2, పిన్నెల్లి-1, పెదగార్లపాడు-1, రామాపురం మేజర్ కాలువ పరిధిలో.. దాచేపల్లి-3, రామాపురం-2 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ప్రతి సాగునీటి సంఘానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడితో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకుంటున్నారు. ఒక్కో సంఘంలో 2 వేలకు పైగా ఓట్లు ఉంటాయి. సాగునీటి సంఘాలకు కమిటీలను శనివారం ఎన్నుకుంటున్నారు. సాగునీటి సంఘాల కమిటీ ఎన్నికలు ముగిసిన తరువాత ఎన్నికైన అధ్యక్షులు తంగెడ, రామాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఆదివారం ఎన్నుకుంటారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సభ్యత్వం ఉన్న సభ్యులు శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని జలవనరుల శాఖ ఏఈ పసుపులేటి ఆదినారాయణ తెలిపారు. సాగునీటి సంఘాల కమిటీలకు దాదాపుగా టీడీపీ, జనసేన నాయకులే బరిలో నిలిచారు.



నారాయణపురం జలవనరుల శాఖ కార్యాలయం వద్ద నీటి తీరువ రశీదులు తీసుకుంటున్న రైతులు

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించండి తహసీల్దార్ బత్తుల వాణి

మాచర్ల రూరల్: సాగునీటి సహకార సంఘాల ఎన్నికల నిర్వాహణలో అధికారులు పూర్తిగా అవగాహన పొంది ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వివాద రహితంగా ఎన్నికలు నిర్వహించాలని తహసీల్దార్ బత్తుల వాణి కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓలు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికలు ఆయా గ్రామాలలో నిష్పక్షపాతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.రమణ, ఆర్ఐ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ఆవుల వెంకట్రామయ్య, బిట్టు వెంకటేశ్వర్లు, యెల్లెబోయిన కోటేశ్వరరావు, సర్వేయర్లు జింకల ఆదినారాయణ, కేశబోయిన ఏసురాజు, సుభాని, మునీనాయక్, దుర్గా, చందర్, కోటేశ్వరరావు, అంగన్‌వాడీ ఉద్యోగులు తదితరులున్నారు.



కార్యదర్శులు, వీఆర్ఓలతో సమావేశంలో తహసీల్దార్ వాణి

ఈ నెల 16 నుంచి శిక్షణ తరగతులు

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 9 రకాల థీమ్స్ సాధించుటకు ఈ నెల 16 నుంచి 19 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించుటకు 9 థీమ్స్‌పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 17 వరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ (డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, వ్యవసాయ, ఉద్యాన శాఖలు) సిబ్బందికి.. 18 నుంచి 19 వరకు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది మహిళా పోలీసులు, సర్వే అసిస్టెంట్స్, వీఆర్ఓలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ సహాయకులు, జూనియర్ లైన్‌మెన్‌లు, ఏఎస్ఎంలకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా హాజరుకావాలని ఆమె కోరారు.